—యమ్. జయశ్రీ



# లిఫ్ట్

రేవంత్ మాధురి ఇద్దరూ మంచి హోలిడే మూడ్‌లో బయటకు బయల్దేరుతున్నారు.

అంతలో

మాధురి స్నేహితురాలు 'ముగ్ధ'వచ్చింది.

"హలో... మాధురి... ఎక్కడికో బయటకు పోతున్నట్లున్నారే...?"

భార్య భర్తలవంక మార్చిమార్చి చూసింది.

"అవును— 'అద్రక్ కీ పంజె' డ్రామా చూడ్డానికి వెళుతున్నాము అవును నీకీ రోజు ఆఫా? ముగ్ధ టెలిఫోన్ డిపార్ట్‌మెంట్‌లో పనిచేస్తోంది.



"ఆఫే! బోర్‌గావుందని నీ దగ్గర కొచ్చాను. అద్రక్ కే పంజె మంచి డ్రామా అంటగదా నేను చాలా సార్లు వెళదామనుకొన్నాను గాని కుదరలేదు. నేను కూడా వచ్చేదా?" ఆశగా అడిగింది ముగ్ధ.

రేవంత్ కల్పించుకొని

"సారీ... రెండే టికెట్స్ వున్నాయి" అన్నాడు.

"పోనీ... మీరిద్దరూ వెళ్ళండి. ఇంతకు ముందు నేనొక సారి చూశాను..." అందులోనూ ఈ రోజు లాస్ట్ 'షో'నట. ఏమంటావ్ అన్నట్లుగా చూసింది ముగ్ధవైపు.

"ఓ... మాధురి థాంక్స్!... థాంక్స్ ఎలాట్" పలుక్కున మాధురి బుగ్గపై ముద్దుపెట్టుకొంది.

"ఊరుకోలే కొంటె కోణంగి. మరి పదండి" భర్త వైపు చూసింది.

"పైకి పోతోంది ఇప్పుడు ఆటో ఎక్కడ దొరుకుతుంది?" భార్యని క్వశ్చన్ మార్కుతో అడిగాడు.

"ఆటో ఎందుకు...? మన 'సుజికి' మీదే వెళ్ళండి," భర్త డౌట్ క్లియర్ చేసింది మాధురి.

భార్య సంస్కారానికి మనసులోనే జోహార్లు అర్పించాడు 'సుజికి' మీద రేవంత్‌ని తగిలి తగలనట్టుగా కూర్చున్న 'ముగ్ధ'ని చూస్తూ బై... బై... చెప్పి లోపలికొచ్చింది 'మాధురి'.

* * *

మర్నాడు సాయంత్రం — మాధురి అన్నయ్య వచ్చాడు వచ్చిన అరగంట తర్వాత.

"నిన్న రేవంత్ బండిమీద ఎవర్నో చూశాను మాధురి అన్న, చిన్నగా నవ్వాడు.

"ఓ... ఆమె నా ఫ్రెండే... రవీంద్ర భారతిలో డ్రామాకి వెళ్ళారు."

మామూలుగా చెబుతున్న చెల్లెల్ని ఆశ్చర్యంగా చూస్తూ "ఏమో... నాకెందుకో నచ్చలేదు" అన్నాడు.

"నేనే స్వయంగా పంపించా నన్నయ్యా — నాకూ ఇందులో స్వార్థం లేకపోలేదు— మా ఆఫీసు ఊరవతల గదా— నాకు ట్రాన్స్‌పోర్ట్ ఇబ్బంది బాగా వుంది. ఎవరినన్నా లిఫ్ట్ అడుగుదామన్నా రేవంత్‌కి తెలిస్తే బాధ పడతాడేమోనన్న భయం ఇక ముందు ముందు నాకా సమస్య లేదు."

గుంభనంగా నవ్వుతోంది మాధురి. *